ఆందోళన వద్దు

● రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. "ప్రస్తుతం ఖజానాలో పైసా లేదు. అంతా ఖాళీ చేసేశారు. ప్రజలు ఆందోళన చెందనవసరంలేదు. ఐదారు మాసాల్లో చంద్రబాబు రాష్ట్రాన్ని అగ్రగామిగా తీసుకువెళ్తారు. ఇకపై ప్రతివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తా. ఇచ్ఛాపురం నుంచి ఎచ్చెర్ల నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో ఇతర మంత్రులు కూడా నాకు మిత్రులు. అలాగే కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో తరచూ ఢిల్లీకివెళ్లి.. శాఖలవారీగా రాష్ట్రానికి అవసరమైన నిధులను కూడా కేంద్రం నుంచి తీసుకువస్తాం. అతిత్వరలోనే శ్రీకాకుళం స్టేడియం, మూడేళ్లలో ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను పూర్తిచేస్తాం. మత్స్యకారుల కోసం జెట్టీలు, రైతులకు అవసరమైన కోల్డ్‌స్టోరేజీలను నిర్మిస్తాం. ఈ బుధవారం నుంచే శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు పనులు ప్రారంభించాలని ఇక్కడ నుంచే కాంట్రాక్టరును ఆదేశిస్తున్నా. రోజుకి 18 గంటలు శ్రమిస్తా. చంద్రబాబుకి అన్ని విధాలా రుణపడి ఉంటాం" అని తెలిపారు.



శ్రీకాకుళంలో గజమాలతో మంత్రులకు సత్కారం



శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు, అభిమానులు

ప్రమాణం చేసి చెబుతున్నా.. అభివృద్ధి చేస్తాం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- రోజుకు 18 గంటలు పనిచేస్తా: రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు
- శ్రీకాకుళంలో బాబాయి, అబ్బాయికి అపూర్వస్వాగతం
- సరిహద్దుల నుంచి నిమ్మాడ వరకు జనసంద్రం
- ఆమదాలవలస రోడ్డు పనులు ప్రారంభించాల్సిందే
- సభ నుంచే కాంట్రాక్టర్‌కు మంత్రి ఆదేశం
- ప్రతీవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తామని స్పష్టం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని.. శ్రీకాకుళం జిల్లాను సమప్తిగా అభివృద్ధి చేస్తామని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మంత్రులుగా ప్రమాణస్వీకారం తర్వాత తొలిసారిగా సోమవారం బాబాయ్, అబ్బాయ్ జిల్లాకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో వారిద్దరికీ అపూర్వ స్వాగతం పలికారు. భారీ ర్యాలీ చేపట్టారు. కార్యకర్తలు, ప్రజలు గజమాలతో సత్కరించారు. అనంతరం శ్రీకాకుళం ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ "అన్నింటి కంటే అత్యంత బలవంతమైన శాఖ పౌరవిమానయానం. దేశ ప్రతిష్ఠను నీ చేతుల్లో పెడుతున్నా అంటూ స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాతో చెప్పారు. ఎర్రన్నాయుడి వారసుడిగా ప్రజలిచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ మూడుసార్లు ఎంపీగా గెలుపొందాను. తెలుగుప్రజల వాణిని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూనే ఉన్నా. ఎర్రన్నాయుడు ఆశయాలను, జిల్లా ప్రజలను మరిచిపోను. ప్రజలసాక్షిగా మరోసారి ప్రమాణం చేసిచెబుతున్నా. రాష్ట్రాభివృద్ధికి.. జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటా. చంద్రబాబునాయుడు నాపై అపూర్వ బాధ్యత ఉంచారు. కేంద్రమంత్రులతో ఉన్న పరిచయాలతో శాఖల వారీగా రాష్ట్రానికి నిధులు తీసుకువస్తా. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా సహకారం అందించారు. భోగాపురం ఎయిర్‌పోర్టును వేగవంతంగా పూర్తిచేస్తాం. రైల్వే సమస్యలను పరిష్కరిస్తా. వైసీపీలా రాక్షసత్వంతో వ్యవహరించబోము. తప్పుచేసిన అధికారులను బ్రహ్మదేవుడు కూడా కాపాడలేడు" అని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల, నరసన్నపేట ఎమ్మెల్యేలు నడుకుదిటి ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, జిల్లా టీడీపీ అధ్యక్షులు కలమట వెంకటరమణ, టీడీపీ మాజీ రాష్ట్రకార్యదర్శి పీవీ రమణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు జిల్లా అధికారులతో మంత్రి అచ్చెన్న సమీక్ష

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జిల్లా అధికారులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సమక్షంలో జిల్లా పరిషత్ సమావేశంలో ఉదయం 10 గంటలకు సమీక్ష జరగనుంది. అన్ని శాఖల అధికారులు, జిల్లాకు చెందిన శాసనసభ్యులు హాజరుకానున్నారు.



జామియా మసీదులో ముస్లిం నమాజ్



నమాజ్ చేస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

భక్తి శ్రద్ధలతో బక్రీద్

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 17: జిల్లాలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు నిర్వహించారు. సోమవారం జిల్లావ్యాప్తంగా మసీదులన్నీ కళకళలాడాయి. శ్రీకాకుళంలోని జామియా మసీదులో ముస్లిం మతపెద్ద ఇమామ్‌వహాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పాల్గొని నమాజు చేశారు. ముస్లిం మతపెద్దలు, కమిటీ సభ్యులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'మతసామరస్యానికి ప్రతీక బక్రీద్ పండుగ. పేదలపై కరుణ చూపి వారికి సాయం చేయడమే ఈ పండుగ విశేషం ప్రతిఒక్కరూ కులమతాలకు అతీతంగా కలసిమెలసి ఉండాలి' అని తెలిపారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు మహిబుల్లాఖాన్, షాన్, హాజీ అమిరుల్లా బేగ్, ఉపాధ్యక్షుడు హాజీ, సెక్రటరీ అక్బర్ భాషా, జాయింట్ సెక్రటరీ షుకూర్ ఖాన్, కోశాధికారి ఉస్మాన్ జాఫర్ భాయ్, జిలానీ ఖాన్ బహదూర్ జానీ పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని కల్యాణం

జలుమూరు, జూన్ 17: సుప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. జ్యేష్ఠ శుక్ల ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని తెల్లవారుజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆలయ ధర్మకర్త, పర్లాకిమిడి రాజు కళ్యాణ గజపతి మహాదేవ వర్మ పేరున స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీముఖలింగేశ్వరుని ప్రత్యేక అలంకరణ చేసి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో పుట్టమన్ను తెచ్చి పీనె వేశారు. ప్రధాన ఆలయంలో మహిళలు సంప్రదాయబద్ధంగా కొట్నం దంచారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను నందివాహనంపై ఆసీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వారాహి సహిత శ్రీముఖలింగేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా చేపట్టారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శివ, శ్రీకృష్ణ, అప్పారావు, యోగి, అచ్యుత, దేవాదాయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరుల విగ్రహాల ఊరేగింపు

బంగారం కొనడానికి వచ్చి..

- మూడు గొలుసులు చోరీ



బంగారం గొలుసు కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తున్న యువకుడు

టెక్కలి, జూన్ 17: టెక్కలిలో నిత్యం రద్దీగా ఉండే జడ్పీ రోడ్డు కచేరీవీధి జంక్షన్‌లోని ఓ బంగారు నగల దుకాణంలో పట్టపగలే చోరీ జరిగింది. కారులో ఓ వ్యక్తి వచ్చి.. మూడు బంగారం గొలుసులతో ఉడాయించాడు. దీంతో బాధిత వ్యాపారి పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే.. టెక్కలిలో రాజరాజేశ్వరి జ్యూయలరీ షాప్‌లో బంగారం గొలుసులు కొనేందుకు సోమవారం ఉదయం 11గంటల సమయంలో ఓ గుర్తుతెలియని యువకుడు కారులో వచ్చాడు. షాపులో ప్రవేశించి యజమాని కోరాడ వరప్రసాద్‌కు బంగారం గొలుసులు చూపించాలని కోరాడు. వరప్రసాద్ గొలుసులు చూపించగా.. వాటి మోడళ్లు చూస్తున్నట్టు నటించాడు. ఈ క్రమంలో మూడు తులాలు గల మూడు బంగారు గొలుసులను పట్టుకుని బయటకు పరుగెడుతూ.. షాపు ముందున్న కారులోకి ఉడాయించాడు. షాపు యజమాని వరప్రసాద్ బయటకు వచ్చి చూడగా.. అప్పటికే కారులో శరవేగంగా అంబేడ్కర్ జంక్షన్ వైపు వెళ్లిపోయారు. ఈ ఘటనతో వ్యాపారులంతా ఉలిక్కిపడ్డారు. దీనిపై వరప్రసాద్ టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీలు పరిశీలించగా కారు ముందుకు ఒక నెంబర్, వెనుక మరో నెంబర్ ఉన్నట్టు గుర్తించామని ఫిర్యాదులో పేర్కొన్నారు. పథకం ప్రకారం ఓ బృందం రెక్కీ నిర్వహించి.. చోరీకి పాల్పడిందని ఆరోపించారు. పట్టణ నడిబొడ్డున పట్టపగలే చోరీ జరగడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

పోర్టు వాహనాలతో.. రోడ్లు ఛిద్రం

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ శాఖ అధికారులు
- మంత్రి అచ్చెన్న దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి

(టెక్కలి)

వైసీపీ పాలనలో రోడ్లు ఛిద్రమయ్యాయి. ప్రధానంగా టెక్కలి నియోజకవర్గ పరిధిలోని మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా మారాయి. పోర్టుకు అవసరమైన పెద్దపెద్ద బండరాళ్లు, గ్రావెల్, బరువు కు మించి వాహనాలపై రాత్రీపగలూ తరలిస్తూనే ఉన్నారు. వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి కాంట్రాక్టర్ కావడంతో భారీ బరువులతో వెళ్లే వాహనాల అంశమై ప్రశ్నించేవారు కరువయ్యారు. పరిమితికి మించిన లోడుతో.. అధిక వేగంతో పోర్టు వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. టెక్కలిలో సబ్‌కలెక్టరేట్, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయాలకు కూతవేటు దూరంలో భారీగా గోతులుపడినా అవి పూడ్చేవారు కరువయ్యారు. వర్షం పడితే.. ఆ గోతుల్లో నీరు చేరి తరచూ ప్రమాదాలు కోకొల్లలు. టెక్కలి మండలం చుట్టూ గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీలకు చెందిన వేస్ట్‌మెటీరియల్ బోల్డర్లు, బండరాళ్లు పోర్టులో నిర్మించే నార్త్, సౌత్‌బ్రేక్‌లకు వినియోగిస్తున్నారు. రోజూ పట్టణం మీదుగా వేలకొలదీ లోడ్ల డంపర్లతో తరలిస్తూనే ఉన్నారు. తెంబూరురోడ్డు జంక్షన్, ఇందిరాగాంధీ కూడలి, అంబేద్కర్ కూడలి, చిన్నబజాం జంక్షన్ ప్రాంతం, నౌపడా-మెళియాపుట్టి రోడ్డు జంక్షన్ ఇలా అన్ని కూడళ్లలో పోర్టు వాహనాలు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఓ వైపు దూళి, మరోవైపు ప్రమాదాల భయం, ట్రాఫిక్ అంతరాయం సమస్యలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. పోర్టు వాహనాల కారణంగా ఒకరిద్దరు మృతి చెందగా.. ఎంతోమంది గాయపడ్డారు. నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో వంశధార ప్రధాన ఎడమకాలువ వంతెన వద్ద, గోపీనాథపురం రైల్వే జంక్షన్ వద్ద, తేలినీలాపురం, ఇజ్జువరం సమీపంలో ఎన్ఎం రోడ్డుపైన, గూడాం సమీపంలో రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా ఆర్అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు ఈ రోడ్ల దుస్థితిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



టెక్కలి సమీపంలో ఎన్ఎం రోడ్డులో ఏర్పడిన గోతులు



టెక్కలిలో పోర్టు వాహనాలను అడ్డుకున్న స్థానికులు (ఫైల్)

దిక్సూచి DIKSUCHI



ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

కంటికి కనిపించదు, ప్రభావం మాత్రమే అనుభవంలోకి వస్తుంది. అదే విద్యుత్తు. ఇంట్లో బల్బు వెలగడం నుంచి నీళ్ళు పైకి ఎక్కించేందుకు ఉపయోగించే మోటారు పనిచేయడం వరకు దీనికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఆ వ్యవహారాన్నంతటినీ ఒక గొడుగు కిందకు తీసుకువస్తే అదే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్. దీనికి సంబంధించిన కెరీర్ వివరాలను చూద్దాం.

కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్ళలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్ళలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ వేలం వెర్రిగా కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

- అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కంట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్ కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.
- భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్, రోబోటిక్స్, ఏరోస్పేస్, సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికీ అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్, ఆసుపత్రుల్లో సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్ఎస్‌టిఒఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్, సీడేక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, బీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా రిఫ్రాక్టరీస్ లిమిటెడ్, హెచ్‌బిఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్, యునైటెడ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, డిఫెన్స్ సర్వీసెస్, రిలయన్స్ పవర్, ట్రాకో కేబుల్ కంపెనీ లిమిటెడ్, నాల్కో, మైక్రాన్ ఎలక్ట్రికల్స్, బీడీఎల్, హాలోనిక్స్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, విప్రో లైటింగ్, ఎన్ఎండీసీలో అవకాశాలు ఉంటాయి. కోర్ ఎలక్ట్రికల్ కంపెనీలకు తోడు యాపిల్, ఐబీఎం, గూగుల్, శాంసంగ్, మైక్రోసాఫ్ట్, సోనీ కార్పొరేషన్, తోషిబా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, సీటీఎస్, ఒరాకిల్, ఇంటెల్, బోష్, ఎరిక్‌సన్, హెచ్‌పీ తదితరాల్లోనూ వీరికి అవకాశాలు ఉంటాయి. టెక్నోపార్క్‌లోని వివిధ ఐటీ సంస్థలు, స్మార్ట్ సిటీ, టెక్నోసిటీ, సైబర్ పార్క్, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, బెల్, సీడాక్, సీఎస్ఐఆర్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కూడా ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు అవకాశాలు కల్పిస్తాయి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అవసరమైన నైపుణ్యాలు ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు విశ్వవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీనేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొన్ని కంపెనీలు వీరిని తీసుకుని స్కిల్ పెంచే కార్యక్రమాలను చేపడుతున్నాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.

- అలాగే ఈ కెరీర్‌లో ఇన్నోవేషన్‌కు అవకాశం ఉంటుంది. ఇది డెస్క్ జాబ్ కాదు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకుంటే నైపుణ్యాల పెంపు, అనుభవం, క్రియేటివిటీతో ఎంత ఎత్తుకు ఎదగవచ్చో అర్థమవుతుంది. కొవిడ్ కాలంలో అందరూ ఇళ్ళకు పరిమితమైనప్పటికీ వీరికి తీరికలేదంటే అతిశయోక్తి కాదు. అంతరాయం లేకుండా విద్యుత్తు, వైఫై వంటి సదుపాయాలను కలిగించడంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు ఎంతో కృషి చేశారన్నది వాస్తవం. ఆరోగ్య పరిరక్షణలో అంటే అప్పట్లో ఆసుపత్రులకు అవసరమైన విద్యుత్తు సరఫరా, ఎలక్ట్రిసిటీతో పనిచేసే పరికరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయడంలో వీరి పాత్ర అమోఘం. ఆర్థికమాంద్యానికి సైతం తలొగ్గని కెరీర్. మల్టీ డైమన్షనల్ కెరీర్ ఆప్షన్స్ ఉన్నాయి. ఇందుకోసం పోర్ట్‌ఫోలియోను పెంచుకోవాలి. పవర్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, రేడియో ఫ్రీక్వెన్సీ ఇంజనీరింగ్ ఈ ఆప్షన్స్‌లో కొన్ని. మల్టిపుల్ స్పెషలైజేషన్స్‌తో భిన్న కెరీర్లకు తద్వారా ఎదిగే అవకాశం ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు ఉంటుంది.
- ఏతావతా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఏమంత గొప్ప కెరీర్ కాదన్న అపోహ ఉంది. అది తప్పు అనడానికి పై ఉదాహరణలే చాలు.



ప్రొఫెసర్ ఎస్.వి.రమణారావు
డైరెక్టర్, ఎస్ఐటి రాయపూర్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/icJV8shలో చదవండి.

ఆర్‌జీఐపీటీలో బీటెక్, ఐడీడీ

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్‌జీఐపీటీ)- బీటెక్, ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ(ఐడీడీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024/జేఈఈ(మెయిన్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. బీటెక్ వ్యవధి నాలుగేళ్లు. ఐడీడీ వ్యవధి అయిదేళ్లు. ఇందులో బీటెక్, ఎంటెక్/ఎంఎస్ డిగ్రీలు పొందవచ్చు. మొత్తం 600 సీట్లు ఉన్నాయి. అదనంగా 106 సూపర్‌న్యూమరరీ సీట్లను మహిళలకు ప్రత్యేకించారు.

బీటెక్ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కెమికల్ 60, కెమికల్ ఇంజనీరింగ్(పెట్రో కెమికల్స్ అండ్ పాలిమర్స్ ఇంజనీరింగ్ 30, రెన్యూవబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ 30), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 60, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 50, మెకానికల్ 30, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 50, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్(అప్లయిడ్ పెట్రోలియం జియోసైన్స్) 20.

ఐడీడీ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ 40, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ పెట్రోలియం & నేచురల్ గ్యాస్ ఇంజనీరింగ్ 10.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు, కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(మెయిన్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే జేఈఈ మెయిన్ 2024 అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు సడలింపులు వర్తిస్తాయి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1416; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రూ.708
- **మొదటి రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 7
- **మొదటి రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 9
- **మొదటి రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 15
- **సెకండ్ రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 18
- **సెకండ్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 27
- **క్యాంపస్ రిపోర్టింగ్:** ఆగస్టు 9
- **రిజిస్ట్రేషన్:** ఆగస్టు 10
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** ఆగస్టు 10, 11
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో డిప్లొమాలు

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు


- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఐఐఐటీఎంలో ఎంబీఏ

కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజపేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఏబీవీ-ఐఐఐటీఎం), గ్వాలియర్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీ అండ్ సిస్టమ్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అంశాలతోపాటు రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, రైటింగ్ కాంప్రహెన్షన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.



అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** జూలై 3
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 4
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 11
- **స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏబీవీ-ఐఐఐటీఎం గ్వాలియర్ - 474015
- **వెబ్‌సైట్:** www.iiitm.ac.in

నవ్య | చిత్రజ్యోతి

'భైరవ యాంథమ్' వచ్చేసింది



ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏ.డీ' నుంచి మొదటి సింగిల్ 'భైరవ యాంథమ్' పూర్తి లిరిక్ వీడియో సోమవారం విడుదలైంది. సినిమా ప్రచారంలో భాగంగా ఈ పాటను విడుదల చేసిన మేకర్స్. ఈ సాంగ్‌ను భారతదేశపు అతిపెద్ద పాటగా పేర్కొన్నారు. ప్రభాస్, పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఈ పాటలో ఆకట్టుకునే వేషధారణతో తలపాగాలు ధరించి సందడి చేశారు. కథానాయకుడి పాత్ర తీరు తెన్నులను ప్రేక్షకులకు పరిచయం చేసేలా సాగే ఈ పాటను రామజోగయ్య శాస్త్రి, కుమార్ రాశారు. తెలుగుతో పాటు హిందీ లిరిక్స్ కలగలసిన ఈ సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే, విజయనారాయణ్ సంయుక్తంగా ఆలపించగా, సంతోశ్ నారాయణన్ సంగీతం అందించారు. కాగా, ఈ సినిమాకు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీదత్ నిర్మించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి భారీ తారాగణం నటించిన 'కల్కి 2898 ఏ.డీ' ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.



డేట్ మారింది!



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప 2' చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ వై ఇంతకుముందు ప్రకటించారు. అయితే షూటింగ్ పార్ట్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడం, క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, టెక్నికల్‌గా మరింత అత్యున్నత విలువలతో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో విడుదల తేదీని మార్చామనీ, డిసెంబర్ 6న సినిమా రిలీజ్ అవుతుందని నిర్మాతలు తాజాగా వెల్లడించారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇంతవరకూ విడుదలైన 'పుష్పరాజ్ టైటిల్ సాంగ్, 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి' అనే కపుల్ సాంగ్ సంచలనం సృష్టించాయి. ఈ రెండు పాటల తర్వాత సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. 'పుష్ప 2' కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అందుకే దర్శకుడు సుకుమార్ విడుదల విషయంలో తొందర పడకుండా మేకింగ్ విషయంలో మరింత శ్రద్ధ తీసుకుని చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.

వరుణ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుంది



వరుణ్ సందేశ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'నింద'. కాండ్రకోట మిస్టరీ ఉప శీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నిఖిల్ మాట్లాడుతూ "ఈ సినిమా వరుణ్‌సందేశ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుంది. అందరూ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి" అని కోరారు. "ఇన్నేళ్ల కెరీర్‌లో నా మనసుకు బాగా దగ్గరైన చిత్రం 'నింద'" అని వరుణ్ సందేశ్ చెప్పారు. "'నింద' మూవీ వరుణ్ కమ్‌బ్యాక్‌కు నాంది పలుకుతుంది" అని దర్శకనిర్మాత రాజేశ్ జగన్నాథం అన్నారు.

యాక్షన్ షో రీల్



రవితేజ, దర్శకుడు హరీశ్‌శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ బచ్చన్' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా షో రీల్‌ను సోమవారం విడుదల చేశారు. ఎలాంటి డైలాగులు లేకపోవడం ఈ రీల్ ప్రత్యేకత. పాత్రలను పరిచయం చేస్తూ ఆసక్తికరంగా ఇది ఉంది. రవితేజ స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌లో కనిపించారు. ఆయన గెటప్ క్లాస్‌టచ్‌తో ఉంది. ఆయన పాల్గొన్న యాక్షన్ సీన్లు మాస్‌ని ఆకట్టుకునేలా ఉన్నాయి. జగపతిబాబు ఓల్డ్ ఫెరోషియస్ మ్యాన్‌గా కనిపించారు. రీల్ చివరిలో రవితేజ అమితాబ్ బచ్చన్‌ను ఇమిటేట్ చేసే సీన్ ఆసక్తికరంగా ఉంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సచిన్ ఖేడ్కర్ కీలక పాత్రను పోషిస్తున్నారు. వీరిద్దరూ కూడా షో రీల్‌లో కనిపించారు. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తామని చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. 'నామ్‌తో సునా హో గా' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, ఫొటోగ్రఫీ: అయనంక బోస్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



కథ విన్నప్పుడే.. సక్సెస్‌ను ఊహించా



విజయ్ సేతుపతి

తెలుగులో మంచి ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకున్న అతికొద్ది తమిళ నటుల్లో విజయ్ సేతుపతి ఒకరు. ఆయన నటించిన 50వ చిత్రం 'మహరాజా'. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, అభిరామి కీలక పాత్రలు పోషించారు. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరమ్, జగదీశ్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుని.. హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా సోమవారం చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మూవీ డైరెక్టర్ నిథిలన్ స్వామినాథన్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని ఎమోషన్‌తో ప్రేక్షకులు చివరివరకూ ప్రయాణిస్తారు. ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చాలా సంతోషాన్నిస్తోంది. ఈ సినిమాని ఇంతలా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు" అని అన్నారు. "నన్ను సినిమా సినిమాకి మరింతగా ప్రేమిస్తున్న తెలుగు ప్రేక్షకులకి నా కృతజ్ఞతలు. ఈ సినిమా కథ విన్నప్పుడే ఇది అందరి మనసులని గెలిచే సినిమా అవుతుందని ఊహించా. ఈ సక్సెస్‌ని ప్రేక్షకులకి అంకితం చేస్తున్నాను" అని విజయ్ సేతుపతి చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KDSZqLa లో చదవండి.

ఎర్ర గులాబీ



మలయాళ నటి హనీ రోజ్ లీడ్ రోల్ పోషిస్తున్న 'రేచల్' చిత్రం టీజర్ విడుదలైంది. వయలెన్స్, బ్లడ్ షెడ్ కలిగిన కథాంశమని ఈ టీజర్ చూడగానే అర్థమవుతుంది. నటిగా హనీ రోజ్‌కు ఉన్న అనుభవం, నైపుణ్యాన్ని ఈ సినిమా ఉపయోగించుకుంటోందనే విషయాన్ని ఈ టీజర్ వెల్లడించింది. నూతన దర్శకురాలు ఆనందిని బాలాను పరిచయం చేస్తూ బాదుషా ఎన్.ఎం, రాజన్ చిరాయిల్ నిర్మిస్తున్నారు. దర్శకుడు అబ్రిడ్ షైన్ ఈ సినిమాకు సహ నిర్మాత. మలయాళంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. రాహుల్ మణప్పట్టు కథ అందించిన ఈ చిత్రానికి ఆయనతో పాటు అబ్రిడ్ షైన్ కూడా స్క్రీన్‌ప్లే తయారు చేశారు.

బాబాయి, అబ్బాయిలకు ఘన స్వాగతం

- అభిమాన సంద్రంగా 'నిమ్మాడ'
- దివంగత నేత ఎర్రన్నాయుడు విగ్రహాల వద్ద నివాళి
- విశాఖ విమానాశ్రయం నుంచి వందలాది వాహనాలతో ర్యాలీ
- అడుగడుగునా నీరా'జనం'



టెక్కలి, జూన్ 17: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవ సాయ, పాడిపరిశ్రమ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రి పదవులు చేపట్టి తొలిసారి సోమవారం జిల్లాకు రావడంతో అపూర్వ స్వాగతం పలి కారు. విశాఖ విమానాశ్రయం నుంచి వారికి ఘన స్వాగతం పలికి వంద లాది వాహనాలతో భారీ ర్యాలీగా స్వగ్రామమైన నిమ్మాడ తరలి వచ్చారు. వారు అర్ధరాత్రికి స్వగ్రామమైన నిమ్మాడ చేరుకున్నారు. అప్పటి వరకు వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు వేచి ఉన్నారు. అబ్బాయి, బాబాయి లకు కుటుంబ సభ్యులు హారతులిచ్చి దిష్టి తీశారు. గ్రామ స్థులు పూలమాల లు వేసి పుష్పగుచ్ఛా లిచ్చి ఘనంగా స్వాగతం పలి కారు. బాబా య్, అబ్బా య్‌లు రాకతో నిమ్మాడ అభిమాన సంద్రంగా మారింది. నియో జకవర్గ టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్దఎత్తున చేరు కొని సంబరాల్లో మునిగితేలారు. అబ్బాయి, బాబాయిలు ముందుగా దివం గత నేత ఎర్రన్నాయుడు కాంస్య విగ్రహానికి, ఎర్రన్నాయుడు ఘాట్‌కు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం కార్యక్రమంలో అచ్చెన్న సోదరుడు కింజరాపు హరివరప్రసాద్, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్, పార్టీ టెక్కలి, కోట బొమ్మాళి, నందిగాం మండలాల అధ్యక్షులు బగాది శేషగిరి, బోయిన రమేష్, పినకాన అజయ్ కుమార్, టెక్కలి వర్తక సంఘం నాయకులు లాడి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ లు వెలమల విజయ లక్ష్మి, తర్ర రామకృష్ణ, సీనియర్ టీడీపీ నాయకులు బోయిన గోవిందరాజులు, పోలాకి చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: విశాఖ ఎయిర్‌పోర్టులో కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే పట్టణంలో మంత్రులకు గజమాలతో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సత్కరించారు. నియోజకవర్గం నుంచి నాయకులు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు వెళ్లి అక్కడ మంత్రులకు స్వాగతం పలికారు.

కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఎమ్మెల్యే ఎంజీఆర్ స్వాగతం

పాతపట్నం/కొత్తూరు/మెళియాపుట్టి: కేంద్ర పౌర, విమాన యాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు తొలిసారి జిల్లాకు వచ్చిన సందర్భం గా సోమ వారం విశాఖలోని విమానాశ్రయంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఘనంగా స్వాగతం పలికారు. మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినం దించారు. కొత్తూరు నుంచి భారీ సంఖ్యలో నేతలు, కార్యకర్తలు మంత్రులకు స్వాగతం పలికేందుకు తరలివెళ్లారు. అలాగే రాష్ట్ర హోం మంత్రిగా నియమి తులైన వంగలపూడి అనితను ఎమ్మెల్యే గోవిందరావు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

మంత్రులకు ఘన స్వాగతం

రణస్థలం: కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయు డు, కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రులుగా బాధ్యతలు చేపట్టి తొలి సారిగా



రణస్థలం: పైడిభీమవరం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

సంచా పేల్చి సందడి చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇజ్జాడ శ్రీనివాసరావు, ఇనపకుర్తి తోటయ్యదొర, పిన్నిం టి మధుబాబు, లంకలపల్లి శ్రీనివాసరావు, గంట్యాడ మహేష్, ముప్పిడి మురళీ మోహన్, దన్నాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలిలో ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న బాబాయి, అబ్బాయి తదితరులు

గొండు శంకర్‌కు అచ్చెన్న అభినందన

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి: శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను శ్రీకాకుళం సభలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. ఉద్దండులు, మహామహులు ఉన్న శ్రీకాకుళం నియోజకవర్గంలో స్వాతంత్ర్యం అనంతరం ఏ ఒక్కరికీ రాని మెజార్టీని సాధించావ్ అంటూ కొనియాడారు. ఇదే స్ఫూర్తితో నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని.. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో తాము అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. కేఆర్ స్టేడియాన్ని, ఆమదాలవలస రోడ్డును సకాలంలో పూర్తి చేయా లని, అలాగే మత్స్యకారుల కోసం జెట్టీలు నిర్మించాలని, యువత కోసం పరి శ్రమలు తీసుకురావాలని మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు చేసి మంత్రులను ఆశీర్వదించారు. ఆ తర్వాత సన్మానించారు.



నరసన్నపేటలో అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్, చిత్రంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే రమణమూర్తి

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల: కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులు తొలిసారిగా జిల్లా కు సోమవారం విచ్చేసిన సందర్భంగా ఎచ్చెర్లలో ఘన స్వాగతం లభిం చింది. అరిణాం అక్కివలస నుంచి కుశాలపురం వరకు దారిపొడవునా టీడీపీ నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఎచ్చెర్లలో ఎస్ఎం పురం గ్రామానికి చెందిన తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. మంత్రులతో పాటు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఉన్నారు. టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధన లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, పార్టీ నేతలు వావిలపల్లి రామకృష్ణ, గాలి వెంకటరెడ్డి, మెండ రాజారావు, గూరు జగపతిబాబు, మూకళ్ల భాస్కరరావు, గట్టెం శివరామ్, గాడు రామారావు, పొందూరు భీమారావు, కొత్తకోట అమ్మి నాయుడు, చౌదరి అవినాష్, అన్నెపు భువనేశ్వరరావు, పైడి అమ్మి నాయుడు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

గార మండలం నుంచి..

గార: కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన కింజరాపు రామ్మో హన్ నాయుడు, అచ్చెన్నాయుడు తొలిసారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైజాగ్ ఎయిర్ పోర్టుకు వెళ్లారు. పార్టీ నాయకులు గుండ భాస్కరరావు, జీవీ రమణమూర్తి, పీస వెంకటరమణ మూర్తి, బడగల వెంకట అప్పారావు, మళ్ల అబ్బాయి నాయుడు, మళ్ల నర్సింగ రావు, మైగాపు ప్రభాకరరావు, కైబాడి రాజు, గోర సురేష్, గిరి, టీఎస్ఎన్ ప్రసాద్, పి. కృష్ణమూర్తి, పి.వైకుంఠరావు, రాధాకృష్ణ రెడ్డి, జేసీ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.





కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో మంత్రులకు అర్ధరాత్రి పూలవర్షంతో స్వాగతం పలుకుతున్న అభిమానులు, క్యాడర్

మంత్రుల స్వాగతానికి తరలిన క్యాడర్

నందిగాం: కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా నియమితులై తొలిసారి సోమ వారం జిల్లాకు విచ్చేసిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చె న్నాయుడు లకు స్వాగతం పలికేందుకు మండలం నుంచి భారీ సంఖ్యలో కూటమి నేతలు, కార్యకర్తలు విశాఖపట్నం వెళ్లి బాబాయి, అబ్బాయిలకు స్వాగతం పలికారు. పోలాకి చంద్రశేఖర్, జీరు నానీరెడ్డి, చింతాడ కృష్ణారావు, మదన్ గౌడ్ తదితరులు బాబాయి, అబ్బాయిలకు దుశ్శాలువాలతో సత్కరించారు.

అబ్బాయ్, బాబాయ్‌లకు నీరాజనం

నరసన్నపేట: మంత్రులుగా నియమితులై తొలిసారిగా జిల్లాకు వచ్చిన కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులకు సోమ వారం మడ పాం టోల్‌ప్లాజా వద్ద నియోజకవర్గ కూటమి నాయకులు ఘన స్వాగతం తెలిపారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక ర్తలు, నాయకులు ద్విచక్ర వాహనాలతో మడపాం నుంచి నిమ్మాడ వరకు

జిల్లాకు వస్తున్న నేపథ్యంలో జిల్లా ముఖద్వారం పైడి భీమవరం వద్ద సోమవారం ఎమ్మెల్యే నడు కుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు ఆధ్వ ర్యంలో టీడీపీ కార్యక ర్తలు, నాయకులు, బీజేపీ, జన సేన నాయకులు ఘన స్వాగతం పలికారు. రణస్థలం జంక్షన్ దన్నానపేట వద్ద ఉన్న దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి బాబాయి, అబ్బాయిలు నివాళులర్పించారు. కార్యక్ర మంలో పార్టీ నాయకులు ముప్పిడి సురేష్, బెండు మల్లేశ్వరరావు, రవి కుమార్, పిషని జగన్నాథం నాయుడు, లంక ప్రభ, డీజీఎం ఆనందరావు, రౌతు శ్రీనివాసరావు, వద్ధాది శ్రీనివాసరావు, దన్నాన సత్తిబాబు పాల్గొన్నారు.

సుభద్రాపురం జంక్షన్ వద్ద..

లావేరు: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు సుభద్రాపురం జంక్షన్ వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. బాణా



లావేరు: సుభద్రాపురం జంక్షన్ వద్ద అభివాదం



గార: వైజాగ్ ఎయిర్ పోర్టు వద్ద టీడీపీ మండల నాయకులు



ఎచ్చెర్ల: ఎచ్చెర్ల వద్ద మంత్రుల రాకకోసం వేచి చూస్తున్న జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి తదితరులు

ఆక్రమణల తొలగింపు

నరసన్నపేట: ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని అక్రమ నిర్మాణాలను సోమవారం పంచాయతీ అధికారులు తొలగించారు. ప్రహరీని ఆనుకొని అక్రమ నిర్మాణాలు సాగుతున్నట్లు పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. ఎటువంటి ఆక్రమణలు చేపట్టినా తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నరసన్నపేట: పట్టణంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు బజారువీధి, జోగిపేట, పప్పులవీధి, మఠంవీధి, బైరాగివీధి తదితర వీధుల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. ఆయా వీధుల్లో విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు మార్పు చేస్తున్నందున విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విష యాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

పలాస: పలాస విద్యుత్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం నూతన కార్య వర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.రామ్మోహన్ (సోంపేట), కార్యదర్శిగా తెంప తిరుపతిరావు(పలాస రూరల్), కోశాధికారిగా టి.ఈశ్వరరావు (పలాససిఫ్ట్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తలగాన ప్రభాకరరావు(పలాస టౌన్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రీజనల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు టెక్కలిలోని ఓ కల్యాణ మంపడంలో నిర్వహించారు.

తూనిక యంత్రాలకు సీలు తప్పనిసరి

జలుమూరు: తూనిక యంత్రాలకు వ్యాపారులు ప్రతి ఏటా సీలును వేయించుకుని రెన్యువల్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆ శాఖ పలాస ఇన్‌స్పెక్టర్ టి.శ్రీధర్ తెలిపారు. చ ల్లవానిపేట కల్యాణమండపంలో సోమవారం ఎలక్ట్రానిక్ యంత్రాలు, కాటాలకు సీలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులు ఎవరైనా అధిక ధరలకు వస్తువులు విక్రయించినా, తూ కంలో తేడాలున్నట్లు రుజువైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్య క్రమంలో చింతాడ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మిథున సంక్రమణ హోమం

పలాసరూరల్: స్థానిక జగన్నాథ ఆలయంలో జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మిథున సంక్రమణం సందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు చేప ట్టారు. విశ్వకల్యాణం కోరుతూ ప్రతినెలా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘ కార్యదర్శి బాబూరావు పండా తెలిపారు. కార్యక్రమంలో ఒడియా బ్రాహ్మణ సంఘ సభ్యులు రాఘవ పండా, కామేశ్వరపండా, దాస్, కైలాస్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

వీరవనిత ఝాన్సీలక్ష్మీభాయి

పాతపట్నం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమపాఠశాలలో సోమవారం రామ రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహారాణి ఝాన్సీలక్ష్మీభాయి వర్ధంతిని నిర్వహించారు. ఆమె విగ్రహానికి నూలుపోగులతో తయారుచేసిన దండను వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 1857లో ఆంగ్లేయుల పాలనను వ్యతిరేకిస్తూ జరిగిన మొదటి స్వాతంత్ర్య సంగ్రామంలో వీర వనిత ఝాన్సీ లక్ష్మీభాయి వీరోచితంగా పోరాడి జోన్ ఆఫ్ ఆర్క్‌గా దేశచరిత్రలో నిలిచి పోయారన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, ట్రస్టు సభ్యుడు పి.రామరాజు, ఉపాధ్యాయులు వై.సునీత, ఎస్.రాధ, బి.భవాని, వి.కుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుకలు

నందిగాం: గణపతి సచ్చిదానంద స్వామీజీ 82వ జన్మదిన వేడుకలను పెద్దతామరాపల్లిలో సోమ వారం నిర్వహించారు. తమిరె మధుసూదనరావు ఆధ్వర్యంలో స్థానిక దత్త మందిరం వద్ద పాదుకా పూజ, విష్ణు సహస్ర నామార్చన తదితర కార్యక్రమాలు గ్రామ పురోహితులు మామిడి సింహాచలం శర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. అంతకుముందు స్వామీజీ చిత్ర పటంతో నగర సంకీర్తన నిర్వహించారు.

రైల్వే స్టేషన్‌లో కనీస సదుపాయాలు శూన్యం

- మరుగుదొడ్లకు తాళాలు
- సిమెంట్ కుర్చీలపై వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

(పలాస)

జిల్లాలో ప్రధాన రైల్వే స్టేషన్లలో పలాస ఒకటి.. స్టేషన్ అభి వృద్ధి పేరుతో కనీస సదుపాయాలు దూరం చేయడంతో ప్రయా ణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ప్లాట్‌ఫారం పై ఉన్న మరుగుదొడ్లను మూసి వేయడంతో వారు పడుతున్న ఇబ్బం దులు అన్నీ, ఇన్నీ కావు. ప్లాట్‌ఫారంపై కూర్చునేందుకు గతంలో వేసిన కుర్చీలను సైతం విడిచిపెట్టకుండా వాటిపై వ్యర్థాలను వేయడం తో చెట్ల నీడన నిలుచోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌లో భాగంగా పలాసకు రూ.25 కోట్ల నిధులు మంజూరు చేశారు. అప్పటికే అభివృద్ధిలో ఉన్న స్టేషన్ ప్లాట్ ఫారా లపై కొత్తగా పనులు చేయడం ప్రారంభించారు. ఫ్లోరింగ్‌ను గ్రానై ట్ పలకలతో ఆధునికీకరిస్తుండడంతో పాతవి తొలగిస్తున్నారు. అయితే వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ స్టేషన్ ప్లాట్‌ఫారాలపై వేసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా ఆటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్లాట్‌ఫారాలపైనే కుప్పలుగా వేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నా రన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రధాన రైళ్లు ఆగినప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన



మూసివేసిన స్త్రీల మరుగుదొడ్లు

వ్యక్తంచేస్తున్నారు. ప్రయాణికుల రద్దీ సమయంలోనే పనులు చేస్తుండడంతో వారు రైలు ఎక్కేందుకు ఇబ్బందులు పడాల్సిన పరి స్థితి ఎదురవుతోంది. ఇదిలా ఉండగా ప్లాట్‌ఫారంపై ఉన్న మరు గుదొడ్లను తాత్కాలికంగా మూసివేయడంతో ప్రయాణికుల అవస్థ లు వర్ణనాతీతం. ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. మరుగుదొడ్లకు వెళ్లాల్సి వస్తే అరకిలోమీటరు స్టేషన్ బయటకు వెళ్లి రావాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు ప్రయాణికులు వేచి ఉండేందుకు వీలుగా కుర్చీలను ఏర్పా టు చేయాలని, మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



ఫ్లాట్‌ఫారం-3లో బెంచీలపై వేసిన వ్యర్థాలు



ఫ్లాట్‌ఫారంపై ప్రయాణికులు వెళ్ల ప్రాంతంలో వ్యర్థాల కుప్పలు

ఎల్.ఎన్.పేటలో భారీవర్షం

ఎల్.ఎన్.పేట: మండలంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు భారీ వర్షం కురిసింది. భయంకరమైన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఒకింత ఆందోళనకు గురైనా పంటలకు ఈ వర్షం ఉప యోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇంతవరకు కురిసిన వర్షాల్లో ఈరోజు కురిసిన వర్షమే అధికమని తురకపేట, దబ్బపాడు, వాడవలస, కృష్ణాపురం, శ్యామలాపురం, కరకవలస, చింతలబడవంజ తదితర గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

వీధి కుక్కల దాడి.. బాలికకు గాయాలు


గాయపడిన బాలిక మేఘన

పలాస: స్థానిక సీతారామ్‌నగర్ కాలనీలో కుక్కల దాడిలో అదే ప్రాంతానికి చెందిన పాతాల మేఘన అనే ఐదేళ్ల బాలిక తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను సమీపంలో ఉన్న సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మేఘన తన ఇంటి నుంచి ఆటాడుకోవడానికి ఎదురింటికి వెళ్లే క్రమంలో వీధి కుక్కలు దాడి చేసి ఛాతీ, చేయి, ముఖంపై కరిచాయి. స్థానికులు చూసి కుక్కలను తరమడంతో బాలిక చిన్నపాటి గాయాలతో బయటపడింది. యాంటీరేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉండడంతో వాటిని వినియోగించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యాధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉండడంతో స్థానికులు భయందోళనకు గురవుతు న్నారు. కొద్ది నెలల క్రితం ఇదే ప్రాంతంలో వీధి కుక్కలు స్వైర విహారం చేసి మొత్తం తొమ్మిది మంది పాదచారులకు కరిచిన విషయం పాఠకులకు విదితమే. తరచూ కుక్కలు పాదచారులను వెంబడిస్తూ తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలబారి నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

కారు-బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో కారు, ద్విచక్ర వాహనం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పలాస: కేటీ రోడ్డు పలాస ఎస్ఆర్ పెట్రోలు బంకు వద్ద సోమవారం మధ్యాహ్నం కారును ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒడిసా రాష్ట్రం రామగిరి గ్రామానికి చెందిన సవర జోగారావు, సవర సంతోష్ సావత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గొప్పిలి గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వీరు వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదదాటికి కారు ముందు భాగం నుజ్జయింది. అందులో ప్రయాణిస్తు న్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుప త్రిలో చేర్పించగా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు..



చికిత్స పొందుతున్న భార్యాభర్తలు

నందిగాం/ పలాస రూరల్: నందిగాం మండలం పాలవలస సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యా భర్తలకు గాయాలయ్యాయి. నందిగాం హెచ్‌సీ ఢిల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నర్సిపురం కృష్ణారావు, పాపమ్మ దంపతులు ద్విచక్రవాహనంపై టెక్కలి వస్తుండగా పాలవలస వద్ద అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో భార్యాభర్తలకు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ఢిల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటలను పారబోస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

హరిపురం: మందస మండలం కొండలోగాం పంచాయతీ కారిగాం గ్రామంలో ఎస్ఈబీ అధికారులు సోమవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1200 లీటర్ల బెల్లం ఊటలతో పాటు 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు సీఐ జైభీం తెలిపారు. సారా తయారీ, రవాణాపై పూర్తి నిఘా పెట్టామని, ఎవరైనా అమ్మకాలు, తయారీ చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తయారీ వివరాలను 9440902358 నెంబరుకు తెలియ జేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో సోంపేట, పలాస ఎక్సైజ్ సిబ్బంది మోహనరావు, కాంతారావు, యోగీశ్వరరావు, భానుకుమార్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

రణస్థలం: బంటుపల్లి గ్రామానికి చెందిన వై.చిన్నారావు యూబీ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం వేతన ఒప్పందం విషయమై జీఎం డి.రామకృష్ణతో చర్చలు జరిపారు. ఈ సమయంలో ఇవురు మధ్య మాట మాట పెరిగింది. జీఎం డి.రామాకృష్ణతో పాటు మరో ఏడుగురు కులం పేరుతో దూషించారని చిన్నారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జీఎంతో పాటు మరో ఏడుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు



సినీ నిర్మాత అంబికా కృష్ణకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో, రైల్వే ఏజీఎంకు స్వామివారి చిత్రపటాన్నిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని సినీ నిర్మాత, మాజీ ఎమ్మెల్యే పీవీవీపీ కృష్ణారావు(అంబికా కృష్ణ), సికింద్రాబాద్ రైల్వే ఏజీఎం పీడీ మిశ్రా కుటుంబ సమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికలను ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి వారికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి షన్ముఖశర్మ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


నరసన్నపేట: పూజలందుకుంటున్న సీతారాములు


జలుమూరు: నృసింహస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

జలుమూరు: సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శ్రీలక్ష్మీ సమేత నృసింహస్వామి కల్యాణం సోమవారం ఉదయం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పురోహితులు జగన్నాథ శర్మ నేతృత్వంలో అర్చకులు విశ్వనాథ దాసు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, మండపారాధన అనంతరం స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శాంతి హోమం చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొని తీర్థ ప్రసా దాలను స్వీకరించారు.

కన్నుల పండువగా సీతారాముల..

నరసన్నపేట: జమ్ము గ్రామంలోని శ్రీరామ మందిరం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సీతా రాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. మావుడూరి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో సత్యవరం రుత్వికులు విఘ్నేశ్వర పూజ, మండపారాధన, సీతారామ కల్యాణం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మదాత వాన గోవింద రాజులు, డాక్టర్ రెడ్డి సంధ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

దూదివారి వీధిలోని వేంకటేశ్వర స్వామికి..

శ్రీకాకుళం కల్చరల్: చిన్నబజారులోని దూదివారి కోవెల వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భూదేవి శ్రీదేవి సమేతంగా వెంకటేశ్వర పూల తో అలంకరణలో నిర్వహించి పూజలు ని ర్వహించారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అదే విధంగా విశాఖ-బీ కాల నీలో ఉన్న శివ బాలాజీ ఆలయంలో వార్షికోత్స కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర శివ బాలాజీ స్వామికి ప్రత్యేకంగా పూలతో అభిషేకం నిర్వహించారు. అర్చకులు గోపి సంబాల సంతోష్ స్వామి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వ హించారు. మొండేటి వారి వీధిలో ఉన్న షిర్డీసాయి ఆలయం లో శివకేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పూలతో అలంకరణ నిర్వ హించారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. శివకేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.


శ్రీకాకుళం కల్చరల్: దూదివారి కోవెలలో వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

లక్ష్మీనృసింహ స్వామి..


గార: లక్ష్మీనృసింహ స్వామి వారి కల్యాణం

గార: బూరవెల్లిలో ప్రసిద్ధ లక్ష్మీనృసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రతీ ఏటా జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి రోజున ఇక్కడ జరిగే ఈ ఉత్సవంలో భాగంగా సోమవారం రాత్రి ఆలయ మండపంలో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సీతా రామస్వామి, ఇతర అర్చక బృందం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఉమా రుద్రకోటేశ్వర స్వామి ఆలయంలో..


స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నాగావళి నది ఒడ్డున ఉన్న ఉమారుద్ర కోటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ ఉత్సవం, సోమవారం తొలి ఏకాదశి సందర్భంగా అర్చకులు ఆరవెల్లి సీతారామ శర్మ రామ్‌జీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం పంచామృతంతో నారికేళ్ల అభిషేకం మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం జరిగింది. అనంతరం సర్వవాహనంపై స్వామి వారి ఉత్సవమూర్తులను శ్రీకాకుళం పురవీధిలో తిరువీధి నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణ మండపలో ఉత్సవమూర్తులను ఉంచి కల్యాణ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.


అరసవల్లి: వేంకటేశ్వరునికి తులసి దళార్చన చేస్తున్న అర్చకులు

మహా తులసీ దళార్చన

అరసవల్లి: నగరంలోని అరసవల్లి రోడ్డులో గల రమ్య తిరుమల ఆలయంలో సోమవారం నిర్జల ఏకాదశి ని పురస్కరించుకుని వేంక టేశ్వర స్వామివారికి మహా తులసి దళార్చన నిర్వహిం చారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేడుకగా బక్రీద్


ఇచ్ఛాపురం: లాలాపేట జమ్మా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, మత పెద్దలు

ఇచ్ఛాపురం: స్థానిక లాలాపేట జమ్మా మసీదులో సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మా మసీదుకు చెందిన ముస్లీంలు ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్ నిర్వహించారు. కార్యక్రమంలో మసీద్ ప్రెసిడెంట్ అహమ్మద్ అలీ, గురువు అనిసుల్ ఖాద్రీ, మత పెద్దలు ఫారీద్, సమీర్ అలీ, బాబు షరీఫ్, రఫీ, జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షుడు జిలానీ పాల్గొన్నారు.

కంచిలిలో..

కంచిలి: కంచిలి మసీద్‌లో బక్రీద్ వేడకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నమాజ్, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మత గురువులు ఖురాన్ గ్రంథంపై ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో తాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

● **నరసన్నపేట:** స్థానిక జామియా మసీదులో సోమవారం బక్రీద్‌ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ సందర్భంగా ప్రతి ముస్లింలు దాన ధర్మాలు చేయడం, ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం జరుగుతుందని ముస్లిం పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ సభ్యులు షేక్ బాబ్జీ, షేక్ మదీనా, ఎండీ అరఫ్, మహ్మద్ అజాద్, షేక్ సబీర్, అబ్దుల్లా, ఎండీ షేకాత్తా తదితరులు పాల్గొన్నారు.


నరసన్నపేట: జామియా మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు


కంచిలి: మసీదులో ప్రసంగిస్తున్న ముస్లిం మతపెద్ద

అర్ధ శతాబ్ది సదస్సు విజయవంతం చేయండి

● ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి



సంఘ ప్రతినిధులతో ప్రచారం చేస్తున్న కృష్ణవేణి

అరసవల్లి: తెలుగు రాష్ట్రాల్లో గత 50 ఏళ్లుగా ఉద్యమ మార్గాన్ని ఎంచుకుని పోరాటం చేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం అర్ధ శతాబ్ది ముగింపు సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షురాలు సవలాపురపు కృష్ణవేణి పిలుపునిచ్చారు. జూన్ 22వ తేదీ శనివారం ఉదయం 10.00 గంటలకు విశాఖలోని బీవీకే కాలేజీకి ఎదురుగా ఉన్న పౌర గ్రంథాలయంలో ప్రారంభం కానున్న సదస్సుకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావాలని కోరారు. సోమవారం ఉదయం జిల్లా కేంద్రానికి సమీపంలోని పెద్దపాడు దరి తంగివానిపేటలో పీవోడబ్ల్యూ కార్యకర్తలతో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ ప్రజా సంఘాల నాయకుల సందేశాలు ఉంటాయని, అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పీవోడబ్ల్యూ అంతిమ లక్ష్యం స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించడమేనని, అందుకు రాజీలేని పోరాటమే మార్గమన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ కార్యకర్తలు దివ్వల లక్ష్మి, ఎస్.లక్ష్మి, రజని, సుజాత, కురమాన అప్పమ్మ, అప్పలనర్సమ్మ, పోలాకి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం చేపట్టారు.

మురుగు కూపంలా కాలువలు

● దోమల వృద్ధి..
● రోగాలబారిన ప్రజలు


డొంకలపర్తలో కాలువ దుస్థితి

బూర్జ: మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పదే పదే చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల వీధి కాలువలు గాలికి వదిలేశారు. డొంకలపర్త గ్రామ పంచాయతీ పరిధిలో పలు కాలువలు మురుగునీరు నిలిచి అక్కడి ప్రజలు రోగాలబారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన పాలకులు, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పుర పాలక సంఘం ఏర్పడి ఐదు సంవత్సరాలు పైబడి కావస్తున్నప్పటికీ వార్డుల్లో మౌలిక సదుపాయాలు నేటికీ పూర్తిస్థాయిలో కానరావడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ గ్రామాల్లో అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అధికారులు మొద్దునిద్ర వీడడం లేదన్నప ఆరోపణలు వినిపిస్తున్నాయి. బూర్జ మండలంలోని దాదాపు అన్ని పంచాయతీలో కాలువలు మూసుకుపోయి.. మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని అక్కడి ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో డ్రైనేజీలపై దృష్టిపెట్టాలని స్థానికులు అంటున్నారు.

రోడ్డును తవ్వేసి వదిలేశారు!


లక్ష్మీనగర్ పాఠశాల సమీపంలో రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

ఆమదాలవలస: పట్టణంలోని మున్సిపల్ అధికారుల తీరుపై పట్టణ ప్రజలతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. స్థానిక 12వ వార్డు లక్ష్మీనగర్ వీధిలో తాగునీటి పైపులైన్ ఇటీవల లీకేజీ ఏర్పడింది. వీధి రహదారి మొత్తం నీటితో నిండిపోయింది. అప్పట్లో మున్సిపల్ సిబ్బంది మరమ్మతు చేయడానికి పెద్ద గుంతను తవ్వి కొన్ని రోజులు అలాగే ఉండిపోవడంతో ఆ రహదారిలో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడేవారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది స్పందించి గుంతను తాత్కాలికంగా మట్టితో పూడ్చి వదిలివేశారు. లక్ష్మీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమపంలో ఉండడంతో విద్యార్థుల రాకపోకలకు, సైకిళ్ల పార్కింగ్ చేయడానికి అవస్థలు పడుతున్నారు. గుంతచుట్టూ ఏర్పాటు చేసిన తవ్విన సిమెంట్ రోడ్డు విద్యార్థుల కాళ్ల మధ్యలో పడిపోయిన ఘటనలు. సాయంత్రం సమయంలో పాఠశాల విడిచిపెట్టే సమయంలో ఒకేసారి రోడ్డు మీదకురావడంతో ఒకరినొకరు నెట్టుకుంటూ ఇదే గుంతలో జారపడడం కూడా చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి లక్ష్మీనగర్ వీధిలో మరమ్మతులకు తవ్విన సిమెంట్ రోడ్డును యథాస్థితిలో నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సముచిత స్థానం కల్పించాలి

సరుబుజ్జిలి: టీడీపీ పునఃవైభవం కోసం ఐదేళ్ల నిరంతరం పోరాటం చేసిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు సముచిత స్థానం కల్పించాలని మాజీ ఎంపీపీ, జిల్లా దళిత సంఘ నాయకులు అప్పలనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కొత్తకోట గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నిరంకుశ పాలన సాగిస్తున్న సమయంలో జిల్లాలో టీడీపీని నడిపించే నాథుడు కరువైన రోజుల్లో పార్టీ శ్రేణులను, కార్యకర్తలను ముందుండి నడిపించిన రవికుమార్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలో ప్రజా సమస్యలపై వైసీపీ ప్రభుత్వంపై పోరాటం చేసి వివిధ పోలీసు కేసుల్లో ముద్దాయిగా ఉన్నప్పటికీ భయం లేకుండా టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా అహర్నిశలు కృషి చేసిన రవికుమార్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: 132కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ హరీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీల్‌చైర్ వితరణ

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం గ్రామానికి చెందిన జి.కేశవరావుకు వ్యక్తి ప్రమాదవశాత్తు రెండు కాళ్లు పోగొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న మందస మండలం సొండిపూడి గ్రామానికి చెందిన మదర్ వలంటీర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం వీల్‌చైర్‌ను బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో నారాయణరావు, లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు, కాళీ, పప్పల ప్రతాప్‌రెడ్డి, ఎస్.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు, ఏసీలు వేయొద్దు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కంచిలి: ఇచ్ఛాపురం లోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో సీటీ పేలిపోవడంతో కంచిలి సబ్‌స్టేషన్ పరిధిలో పలాస నుంచి విద్యుత్ సరఫరా చేసినట్టు డిప్యూటీ ఈఈ వి.సత్యనారాయణ, ఏఈ గురయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల లోవోల్టేజీ కారణంగా వినియోగదారులు ఎవరూ ఏసీలు, మోటార్లు, హీటర్లు, మిల్లర్లు వేయొద్దని కోరారు. పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా వచ్చేంతవరకు వినియోగించకుండా సహకరించాలన్నారు.

వసతిగృహానికి సామగ్రి అందజేత

సోంపేట: నువాగడలోని ఆశ్రమ పాఠశాలకు రోటరీ క్లబ్ సామగ్రిని అందజేశారు. పాఠశాలకు 100 బెడ్లు, 10 ఫ్యాన్లు అందజేశారు. అసిస్టెంట్ గవర్నర్ వి.దినేష్‌కుమార్, డిస్ట్రిక్ సెక్రటరీ ఎం.భాస్కరరావు, సోంపేట రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, కార్యదర్శి పీవీ కృష్ణారావు, కోశాధికారి కె.రవికుమార్ తదితరులు ఉన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

బూర్జ: అల్లెన, గుత్తావల్లి రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో విత్తనాలను రైతులకు అందించారు. 16 రైతు భరోసా కేంద్రాలకు సుమారు 346 క్వింటాళ్ల వరి, పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయని, ఇంకా అవసరమైన రైతులు తమకు కావాల్సిన వరి రకాలు రిజిస్టర్ చేయించుకుంటే విత్తనాలు అందిస్తామన్నారు. యూరియా 280, డీఏపీ 100 మెట్రిక్ టన్నులు ఆర్‌బీకేల వద్ద సిద్ధంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రియాంక, కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.